RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

# అన్వేషనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 24 | మంగళవారం 19 మే 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## గోవుల అక్రమ రవాణా..
## డీజీపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం(మే 16) రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.

2



## పంజాబ్ ఆప్ మంత్రి సంజీవ్ అరోరాకు జూన్ 1 వరకు జ్యుడీషియల్ రిమాండ్

ఆమ్ ఆద్మీ పార్టీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. వస్తు సేవల పన్ను లావాదేవీలలో జరిగిన భారీ మోసాలకు సంబంధించి పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. సుమారు రూ.100 కోట్ల మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ అరెస్ట్ జరిగినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. అరెస్ట్ అనంతరం ఈడీ అధికారులు సంజీవ్ అరోరాను గురుగ్రామ్ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు.

2




## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పై ఆగంతకులు రాళ్లురువ్విన ఘటన బీహార్‌లోని ముజఫ్ఫర్‌పుర్ లో సోమవారంనాడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. మజ్‌హౌలియా–ఖాబ్రా ప్రాంత సమీపంలో పాటలీపుత్ర–గోరఖ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (26501)పై ఈ రాళ్లదాడి జరిగింది. మూడు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులు, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ కు సమాచారం ఇచ్చారు.

2

## మరింత పటిష్టంగా
# భారత్-నార్వే బంధం

### ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
### ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
### నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన




న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

**భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.**

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్–యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్–ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ



పేర్కొన్నారు. భారత్–నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో–నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్–నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.





2

## హైదరాబాద్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే

## నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు
## పెట్టిన సీఎం రేవంత్ : బీజేపీ ఎంపీ

2 లో..



నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2



## చికాగో సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం.. తెలంగాణకు చెందిన 24 ఏళ్ల విద్యార్థిని దుర్మరణం

2



## బండి భగీరథ్ కేసు.. కొత్త సెక్షన్‌ను జోడించిన పోలీసులు

## రేవంత్.. రిజర్వాయర్లు పరిశీలించి నీటి సమస్య తీర్చు: వివేకానంద

హైదరాబాద్:

పలు రిజర్వాయర్లు కట్టి నీటి కష్టం తీర్చిన మహనీయుడు మాజీ సిఎం కెసిఆర్ అని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద కొనియాడారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ పెట్టించి నీటి ట్యాంకర్ల బాధ తీర్చారని అన్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ ఐడిపిఎల్ లోని హెచ్‌ఎండబ్ల్యూఎస్ వాటర్ వర్క్స్ ముందు వివేకానంద ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..మూడేళ్ల పాలనలో ప్రతి కాలనీ, బస్తీలో నీటి ఎద్దడి ఉందని, గాలిమోటార్లతో తిరుగుతూ గాలి మాటలతో సిఎం రేవంత్ రెడ్డి నెట్టుకొస్తున్నారని వివేకానంద విమర్శించారు. ఢిల్లీకి డబ్బు మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై పట్టదా? అని ప్రశ్నించారు. ఢిల్లీకి పోవుడు కాదని, రిజర్వాయర్లు పరిశీలించి నీటి సమస్య తీర్చు అని అన్నారు. నీటి సమస్య పరిష్కరించకపోతే రేవంత్ ఇంటిని ముట్టడిస్తామని వివేకానంద హెచ్చరించారు.



2



## బిజెపిపై బిఆర్ఎస్, కాంగ్రెస్ దుష్ప్రచారం : రాంచందర్ రావు

# సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్‌పైనా టోల్ విధింపు..

## ఇరాన్ కొత్త ఆలోచన

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి



హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగించడంతో ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు ఆకాశాన్నంటాయి. ఈ క్రమంలో ఇరాన్ తాజాగా హోర్ముజ్ జలసంధిలోని సముద్ర గర్భ ఇంటర్నెట్ కేబుల్స్‌పై కూడా దృష్టిసారించింది. ఈ కేబుల్స్‌పై కూడా టోల్ వసూలుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.సముద్రం అడుగున ఉన్న ఈ కేబుల్స్ గ్లోబల్ ఇంటర్నెట్ వ్యవస్థకు జీవనాడిగా మారాయి. గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ టెక్ సంస్థలన్నీ ఈ తీగల ద్వారా జరిగే డేటా మార్పిడిపై అధారపడ్డాయి. అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని ఇంటర్నెట్ హబ్స్‌ను ఈ తీగలే అనుసంధానిస్తాయి. వీటికి నష్టం జరిగితే ఇంటర్నెట్ సేవలు నిలిపోవడం, లేదా నెమ్మదించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది.హోర్ముజ్‌పై సార్వభౌమత్వం తమదే అని పట్టుబడుతున్న ఇరాన్.. నౌకల రవాణాతో పాటు కేబుల్స్ వినియోగంపై కూడా టోల్ వసూలు కోసం ప్రయత్నిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి సంస్థలు ఈ కేబుల్స్‌ను వినియోగించినందుకు తమకు ఫీజు చెల్లించాలని కోరుతోంది. కంపెనీలు తమ డిమాండ్స్‌కు ఒప్పుకోకపోతే ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడవచ్చని కూడా ఇరాన్ పత్రికలు కొన్ని హెచ్చరించాయి. ఈ కేబుల్స్ వాడినందుకు ఫీజులు వసూలు చేస్తామని ఇరాన్ మిలిటరీ ప్రతినిధి ఒకరు గతవారమే ఎక్స్ వేదికగా ప్రకటించారు.ఇరాన్ చట్టాలకు అనుగుణంగా టెక్ సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుందని ఇరాన్ సైన్యం చెబుతోంది. సముద్రగర్భ కేబుల్స్ ఆపరేటర్లు తమకు లైసెన్సు ఫీజులు కూడా చెల్లించాలని పేర్కొంది. ఇక కేబుల్స్ రిపేర్లు, నిర్వహణ కాంట్రాక్టులు ఇరాన్ సంస్థలకే ఇవ్వాల్సి ఉంటుందని చెబుతోంది. ఇలాంటి ఫీజుల వసూలు చట్టబద్ధమని కూడా ఇరాన్ వాదిస్తోంది. సముద్రగర్భ మౌలికవసతులకు సంబంధించి ఫీజులు వసూలు చేసుకునే హక్కు తీరప్రాంత దేశాలకు ఉంటుందని అంతర్జాతీయ చట్టాలు చెబుతున్నాయని అంటోంది. సూయిజ్ కెనాల్ అడుగున ఉన్న సముద్రగర్భ కేబుల్స్‌పై ఈజిప్టు ఇప్పటికే పలు రకాల ఫీజులు వసూలు చేస్తున్న విషయాన్ని ఇరాన్ మీడియా ప్రస్తావించింది. అయితే, సూయిజ్ కెనాల్ జలమార్గం మనుషులు నిర్మించినది కావడంతో ఈ జలసంధికి సంబంధించిన నిబంధనలు హోర్ముజ్‌కు వర్తిస్తాయా? అన్న చర్చ కూడా జరుగుతోంది. ఇక అమెరికా ప్రభుత్వ ఆంక్షల ప్రకారం, అక్కడి సంస్థలు ఇరాన్‌తో ఎలాంటి లావాదేవీలు జరపకూడదు. దీంతో, వాటి నుంచి ఇరాన్ ఫీజులను ఎలా వసూలు చేస్తుందనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.

# గోవుల అక్రమ రవాణా.. డీజీపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం(మే 16) రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు.గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

# పంజాబ్ ఆప్ మంత్రి సంజీవ్ అరోరాకు జూన్ 1 వరకు జ్యుడీషియల్ రిమాండ్

న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

ఆమ్ ఆద్మీ పార్టీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. వస్తు సేవల పన్ను లావాదేవీలలో జరిగిన భారీ మోసాలకు సంబంధించి పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. సుమారు రూ.100 కోట్ల మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ అరెస్ట్ జరిగినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి.అరెస్ట్ అనంతరం ఈడీ అధికారులు సంజీవ్ అరోరాను గురుగ్రామ్ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఆయనకి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ కేసు తదుపరి విచారణను జూన్ 1వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.జీఎస్టీ చెల్లింపులు, దానికి సంబంధించిన లావాదేవీలలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, తప్పుడు పద్ధతుల్లో నిధులను మళ్లించారనే ఆరోపణలపై గత కొంతకాలంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. సుమారు రూ. 100 కోట్ల మేర మనీలాండరింగ్ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో, లోతైన విచారణ కోసం మంత్రి సంజీవ్ అరోరాను ఈడీ బృందం అదుపులోకి తీసుకుంది.పలువురు కీలక నేతలు ఇప్పటికే వివిధ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న తరుణంలో, పంజాబ్ మంత్రి అరెస్ట్ కావడం ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. దీనిపై పంజాబ్ ప్రభుత్వం, ఆప్ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

పాట్నా: అన్వేషనేత్రం ప్రతినిధి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పై ఆగంతకులు రాళ్లురువ్విన ఘటన బీహార్‌లోని ముజఫ్ఫర్‌పూర్ లో సోమవారంనాడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు.మజ్‌హౌలియా-ఖాబ్రా ప్రాంత సమీపంలో పాటలీపుత్ర-గోరఖ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (26501)పై ఈ రాళ్లదాడి జరిగింది. మూడు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులు, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ కు సమాచారం ఇచ్చారు.

### మరో రెండు రైళ్లపైనా..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి జరిగిన కొద్ది సేపటికే అదే రైల్ సెక్షన్‌పై మరో రెండు రన్నింగ్ ట్రైన్స్‌పై రాళ్ల దాడి జరిగింది. పాట్నా-జైనగర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (15550), లిచ్ఛవి ఎక్స్‌ప్రెస్ (14006)ను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో రెండు రైళ్లలోని పలు బోగీల కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయి.

### ప్యాసింజర్ రైలులో మంటలు

కాగా, బీహార్‌లోని ససారం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ప్యాసింజర్ రైలులో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ససారం నుంచి పాట్నాకు వెళ్లాల్సిన ఈ రైలులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనలతో పరుగులు తీశారు. ఒక కోచ్ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. అయితే మంటలను వెంటనే అదుపులోకి తెచ్చారు. ఈ అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరూ గాయపడలేదు.

# చికాగో సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## తెలంగాణకు చెందిన 24 ఏళ్ల విద్యార్థిని దుర్మరణం

నల్గొండ/చికాగో ,

: అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన తెలుగు రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన 24 ఏళ్ల నవ్య, శనివారం రాత్రి అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. నవ్య తన మాస్టర్ ఆఫ్ సైన్స్ (మీా) డిగ్రీ పూర్తి చేయడం కోసం రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లింది. శనివారం రాత్రి ఆమె తన స్నేహితులతో కలిసి పార్ట్ టైమ్ ఉద్యోగానికి వెళ్తుండగా, వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కారు బలంగా ఢీకొట్టింది. అమెరికాలోని నవ్య స్నేహితుల ద్వారా ఈ సమాచారం తమకు తెలిసిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



# నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు పెట్టిన సీఎం రేవంత్ : బీజేపీ ఎంపీ

నిజామాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు.దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

# హైదరాబాద్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్(25-35 మీటర్ల పరిధి) లోపల ఉన్న చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని సుప్రీం కోర్టు




ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పర్యావరణ ప్రేమికురాలు కాజల్ మహేశ్వరి పిటిషన్ దాఖలు చేశారు. కేబీఆర్ పార్క్ హైదరాబాద్‌కు ప్రధాన 'గ్రీన్ లంగ్స్' అని.. ఎకో సెన్సిటివ్ జోన్‌కు రక్షణ కోరుతూ పిటిషన్ వేశారు.2020 అక్టోబర్ 27న ఎకో సెన్సిటివ్ జోన్‌ను తగ్గిస్తూ నోటిఫికేషన్ జారీ అయ్యిందని.. పబ్లిక్ హియరింగ్ లేదని పిటిషనర్ ఆరోపించారు. ఎస్ఆర్‌డీపీ రోడ్డు ప్రాజెక్టుల కోసం ఎకో జోన్ కుదించారని అన్నారు. తెలంగాణ హైకోర్టు మార్చి 31న స్టే ఇచ్చేందుకు నిరాకరించిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టుల పిటిషన్ వేశారు. 19,000 మంది సంతకాలతో వ్యతిరేక పిటిషన్ వచ్చినా పట్టించుకోలేదని పిటిషనర్ ఆరోపించారు. పబ్లిక్ హియరింగ్ జరిగినట్టు రాష్ట్రం తప్పుడు సమాచారం ఇచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.ఈరోజు(సోమవారం) జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె.వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. ఎకో సెన్సిటివ్ జోన్‌ను 'షాక్ అబ్జార్బర్'గా ఉంచాలని పేర్కొంది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలకు భారీ ఆటంకం ఏర్పడింది.

# బండి భగీరథ్ కేసు.. కొత్త సెక్షన్‌ను జోడించిన పోలీసులు

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

బండి భగీరథ్ కేసులో పోలీసులు కొత్తగా మరో సెక్షన్‌ను జోడించారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపణల నేపథ్యంలో దీమీా 64(2)(ఎ) సెక్షన్‌ను కేసులో చేర్చారు. ఈ సెక్షన్ రుజువైతే కనీసం 10 సంవత్సరాలు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే బండి భగీరథ్‌పై దీమీా 64(2)(ఎ), దీమీా 74, దీమీా 75 సెక్షన్లు, ూాజుూా సెక్షన్ 5(1) తీ/ష 6 సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను జోడించారు.బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న బండి భగీరథ్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ గైర్హాజరయ్యారు. హైకోర్టులో మధ్యంతర బెయిల్ కోసం భగీరథ్ పిటిషన్ వేయగా.. అక్కడ కూడా అతడికి నిరాశే ఎదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో.. భగీరథ్ పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. భగీరథ్‌ను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో చెర్లపల్లి జైలుకు పోలీసులు తరలించారు.

# బిజెపిపై బిఆర్ఎస్, కాంగ్రెస్ దుష్ప్రచారం : రాంచందర్ రావు

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

బిఆర్ఎస్ కోట్లు ఖర్చు చేసి బండిసంజయ్, ఆయన కుమారుడికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని టిబిజెపి చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బిఆర్ఎస్ కు రాష్ట్రంలో ఇంకో పని లేనట్టుందని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..బెయిల్ పెండింగ్ లో ఉంది, బండి సంజయ్ కుమారుడి భగీరథ్ సరెండర్ అయ్యాడని తెలియజేశారు. బండి సంజయ్ తప్పు చేయలేదని, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బిజెపిపై దుష్ప్రచారం చేస్తున్నాయని రాంచందర్ రావు రాంచందర్ రావు విమర్శించారు. కుటుంబసభ్యులు తప్పు చేస్తే న్యాయపరంగా చూసుకుంటారని, బండి సంజయ్ తప్పు చేస్తే పార్టీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. బండి సంజయ్ ను లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బిఆర్ఎస్ హయాంలో మహిళలపై 67 శాతం క్రైమ్ రేటు పెరిగిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై మహిళా సర్పంచ్ లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందని, మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్లితే మాజీ సిఎం కెసిఆర్, కెటిఆర్, రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ తీసుకోవడం అనేది హక్కు అని ఆయన పారి పోలేదని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధినేత కవిత లిక్కర్ కేసులో జైలుకు వెళ్తే కెసిఆర్, కెటిఆర్ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కెటిఆర్ కు నైతిక విలువలు లేవని, ప్రజా సమస్యలపైన పోరాడటం చేతగాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కలిశాయి కాబట్టి అరెస్ట్ చేయడం లేదని, రైతులు ధాన్యం కొనుగోళ్లు జరగక ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం, ఈ కార్ రేస్ కేసులో కెసిఆర్, కెటిఆర్ ను సిఎం రేవంత్ రెడ్డి అరెస్ట్ చేయాలని రాంచందర్ రావు కోరారు.

# పంటల కొనుగోళ్లపై ప్రభుత్వానికి రివ్యూ చేసే తీరిక లేదు: జగదీష్ రెడ్డి

హైదరాబాద్:

మిషన్ భగీరథ పథకంలో మాజీ సిఎం కెసిఆర్ ఫ్లోరైడ్ ను తరిమివేశారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. నాడు కేంద్రం వడ్లు కొనకపోతే ఢిల్లీలో కెసిఆర్ ధర్నా చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నల్గొండ లో నాటి సమైక్య రాష్ట్రంలోని రైతుల కష్టాలే రైతులకు మళ్లీ వచ్చాయని విమర్శించారు. 24 గంటల కరెంట్, సాగునీళ్లు, పెట్టుబడి సాయం ఇచ్చి..రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్న నాయకుడు కెసిఆర్ అని కొనియాడారు. రైతుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొని రైతుల ఖాతాలో నగదు వేసినామని, ఇవాళ తెలంగాణలో ఎపి సిఎం చంద్రబాబు శిష్యుడు సిఎం రేవంత్ రెడ్డి దుర్మార్గ పాలన చేస్తున్నారని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. రైతులను పట్టి పీడిస్తున్నారని, అరిగోస పెడుతున్నారని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు ఏదీ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మిల్లర్లతో మంత్రులు కుమ్మకక్కై రైతులను దోచుకుంటున్నారని, పంటల కొనుగోళ్లపై ప్రభుత్వానికి రివ్యూ చేసే తీరిక లేదని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్రమోడీ కనుసన్నల్లో కొనసాగుతున్న హైబ్రిడ్ ప్రభుత్వమిది అని జగదీష్ రెడ్డి దుయ్యబట్టారు.

# రైతుల కోసమే కేసీఆర్ పోరాటం

## ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల విమర్శల వెల్లువ



**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18 :**

నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట బీ.ఆర్.ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు మహాధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చేసిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో రైతులు ఎదుర్కొన్న కష్టాలే ప్రస్తుతం తెలంగాణలో మళ్లీ కనిపిస్తున్నాయని ఆరోపించారు. నల్గొండ జిల్లాను ఒకప్పుడు ఫ్లోరైడ్ భూతం పట్టి పీడించిందని, అప్పట్లో కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా ఆ సమస్యను తరిమికొట్టారని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోతే ఢిల్లీలో కేసీఆర్ ధర్నా చేశారని గుర్తుచేశారు. 24 గంటల విద్యుత్,సాగునీరు, రైతుబంధు వంటి పథకాలతో రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్న నాయకుడు కేసీఆర్ అని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో "చంద్రబాబు శిష్యుడు" అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతులను ఏడిపిస్తున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు చెప్పులతో కొట్టాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లాకు చెందిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని,హెలికాప్టర్లు లేకుండా కాలు కదపడం లేదని ఎద్దేవా చేశారు. జిల్లాలో మంత్రులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వడ్లలో తరుగు తీస్తామని చెబితే సహించబోమని, రైతులను దోచుకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మిల్లర్ల వద్ద నుంచి డబ్బులు తీసుకుని రైతుల కష్టాన్ని కొందరు మంత్రులు దోచుకుంటున్నారని ఆరోపించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రోజుకు 500 కిలోమీటర్లు కారులో తిరుగుతూ మూడు సమీక్ష సమావేశాలు నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టేవాడినని తెలిపారు. ప్రస్తుతం ఒక్క మంత్రి కూడా రైతుల వద్దకు రావడం లేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో "మోదీ-చంద్రబాబు మద్దతుతో నడుస్తున్న హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రభుత్వం" కొనసాగుతోందని, దీనికి రైతులే గుణపాఠం చెప్పాలని జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు ప్రత్యేక ఆహ్వానితులుగా సభ్యత్వ నమోదు ఉమ్మడి జిల్లాల ఇంచార్జీ బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చేశారని అన్నారు. ఇందిరా పార్క్, ఢిల్లీలో ధర్నాలు నిర్వహించి కేంద్రం మెడలు వంచి వడ్లు కొనిపించారని పేర్కొన్నారు. అప్పట్లో మూడు నెలల ముందుగానే సమీక్షలు నిర్వహించి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేసేవారని తెలిపారు. రైతులు ఆనందంగా జీవించే పరిస్థితులు అప్పట్లో ఉన్నాయని చెప్పారు. రైతుబంధు కింద రూ.70 వేల వరకు అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరేనని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి 18 గంటలు సమీక్షలు చేస్తున్నానని చెబుతున్నారని, అయితే అవి రైతుల కోసం కాకుండా రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ను కలిసినప్పుడు రైతుల సమస్యలను ప్రస్తావించకుండా మూసీ సుందరీకరణ,రియల్ ఎస్టేట్ అంశాలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడికి సంబంధించిన కేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. బాధిత మహిళపై తిరుగు కేసులు పెట్టించారని ఆరోపించారు.ఈ అంశంపై కేసీఆర్, కే.టి.రామారావు స్పందించిన తర్వాతే చర్యలు జరిగాయని తెలిపారు. అరెస్టుకు తొమ్మిది రోజులు పట్టిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వ్యవహారంలో డ్రామా చేశారని విమర్శించారు. బీజేపీ నేతలు బాధిత యువతిపై దుష్ప్రచారం చేశారని, ఇలాంటి ఘటనలపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. అవినీతి, అక్రమాలే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని ఆరోపిస్తూ,భవిష్యత్తులో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవడం ఖాయమని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ధర్నాలో పాల్గొన్న బీ.ఆర్,ఎస్ ముఖ్య నేతలు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్,జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్ మాజీ ఎమ్మెల్యే లు భాస్కర్ రావు, గదారి కోశోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్ట్, ఒంటెద్దు నర్సింహా రెడ్డీ, భారీగా త్వరలోచిన కార్యకర్తలు.

# గ్రామీణ డాక్ సేవకుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం అవసరం

## ఏఐజీడీఎస్‌యూ నల్లగొండ డివిజన్ 5వ ద్వైవార్షిక మహాసభలో నాయకుల పిలుపు

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18:**

ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) నల్లగొండ డివిజన్ 5వ ద్వైవార్షిక మహాసభ ఆదివారం నల్లగొండలోని పీఆర్టీయూ-టీఎస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథులుగా ఏఐజీడీఎస్‌యూ తెలంగాణ సర్కిల్ కార్యదర్శి బండి జయరాజు, ఎఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పల్లా దేవేందర్ రెడ్డి, డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ వడ్డపల్లి దామోదర్ రెడ్డి పాల్గొని గ్రామీణ డాక్ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందని విమర్శించారు. గ్రామీణ డాక్ సేవకులకు రోజురోజుకు సమస్యలు పెరుగుతున్నాయని, శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం



గ్రామీణ డాక్ సేవకులు అందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐజీడీఎస్‌యూ నల్లగొండ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా లోకసాని దామోదర్ రెడ్డి, అధ్యక్షుడిగా మేడి అంజయ్య, కోశాధికారిగా ఆరెకంటి యాదయ్యలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా అండగా నిలిచి పోరాడుతామని తెలిపారు. ఈ మహాసభలో లక్ష్మీనర్సయ్య, మహేందర్, మారయ్య, లక్ష్మణ్, శేఖర్, నిర్మల, సునీత, హనుమంత్, భాస్కర్, శ్రీను, సుందరమ్మ, దాస్రు పాల్గొన్నారు

# దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికై మంత్రిని కలిసిన: బాలునాయక్



**హైదరాబాద్/నల్లగొండ/అన్వేషనేత్రం,మే 18:**

తెలంగాణ రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్ధిళ్ళ శ్రీధర్ బాబును దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నేనావత్ దేవరన్ నాయక్ కూడా పాల్గొన్నారు. దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. అనంతరం మంత్రి శ్రీధర్ బాబును బాలు నాయక్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. చెర్వుగట్టు యువతి నవ్య మృతి

## కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల వీరేశం





**నార్కెట్‌పల్లి/నల్లగొండ/అన్వేషనేత్రం,మే 18:**

నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన గడుసు నవ్య అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం నవ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవ్య మృతి తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం మరియు పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవ్యకు నివాళులర్పించారు.

# ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: సీఐటీయూ

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18 :**

ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీమ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్--సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నల్లగొండ మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాంపు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, రూ.50 లక్షల బీమా సౌకర్యం, మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 వేల ఆర్థిక సహాయం, అర్హులైన వారికి ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోగా, నెలనెలా వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న ఆశా వర్కర్లపై పోలీసుల ద్వారా నిర్బంధాలు ప్రయోగిస్తూ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జాబ్‌చార్ట్‌లో లేని అనేక పనులు చేయిస్తూ అదనపు పనిభారం మోపుతున్నారని, దీంతో ఆశా వర్కర్లు అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే జులైలో నిరవధిక సమ్మె



చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ, గంజి రాజేష్, నల్లగొండ పట్టణం, తిప్పర్తి, కనగల్లు మండలాల ఆశా వర్కర్లు కే. స్వర్ణ, డి. నిర్మల, ఎడవల్లి ప్రేమలత, సీహెచ్ వీరభద్రమ్మ, గాదరి పూలమ్మ, హేమలత, సీహెచ్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు వేడి నుంచి ఉపశమనం--వాటర్ బాటిల్స్, క్యాప్స్, గ్లూకోజ్ పౌడర్ పంపిణీ..ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18 :**

మండుటెండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఉపశమనం కలిగించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ గారు (టి.ఎస్.జి.ఆర్.ఈ.ఏ) (తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్) సహకారంతో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాటర్ బాటిల్స్, క్యాప్స్ (హ్యాట్స్), గ్లూకోజ్ పౌడర్‌తో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు క్లాత్ బ్యాగులు కూడా






అందజేశారు. మొత్తం సుమారు రూ.50,000 విలువైన సామగ్రి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ గారు మాట్లాడుతూ, ఎండల్లోనూ ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ పోలీసులు నిరంతరం కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. గంటల తరబడి రోడ్లపై నిలబడి వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ప్రమాదాలు నివారించడంలో వారి సేవలు అమూల్యమని కొనియాడారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణలో రాజీ పడకుండా పనిచేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. తరచూ నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.పోలీస్ శాఖకు అండగా నిలుస్తూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన (టి.ఎస్.జి.ఆర్.ఈ.ఏ) ప్రతినిధులకు ఎస్పీ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్యతో పాటు (టి. ఎస్.జి.ఆర్.ఈ.ఏ)రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి. దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు జి. వెంకట్ రెడ్డి, భవన కమిటీ చైర్మన్ జి. నారాయణ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. యుగేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కృష్ణయ్య, సి హెచ్ యాదగిరి, ఆర్థిక కార్యదర్శి ఎం. శంకర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి, మండల కార్యదర్శి వాసుదేవ్, కె. రామలింగం, రమేష్, కోర్ కమిటీ చైర్మన్ రామనాథం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిర్యాదుల తక్షణ పరిష్కారానికి ఆదేశం.. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్లగొండ,అన్వేషణనేత్రం,మే 18 :**



నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, సైబర్ మోసాలు, ఆర్థిక లావాదేవీలు, పోలీస్ సంబంధిత ఫిర్యాదులు తదితర అంశాలపై ఎస్పీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దాదాపు 38 మంది పిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ అధికారులతో వెంటనే విచారణ చేపట్టి చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు పోలీస్ శాఖపై నమ్మకంతో ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయుక్తంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదగాని శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18 :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదగాని శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు పార్టీ కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపగా, కార్యకర్తలు నినాదాలతో కార్యక్రమ ప్రాంగణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా మాదగాని శ్రీనివాస్ గౌడ్ గుర్తింపు పొందారని పలువురు నాయకులు కొనియాడారు. బీజేపీ సిద్ధాంతాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో ఆయన పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాదగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తనపై చూపుతున్న అభిమానానికి పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాల సాధనకై మరింత కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తానని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారానే ప్రజలకు చేరువ కావచ్చని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా సామాజిక సేవ కార్యక్రమాలను కొనసాగిస్తానని చెప్పారు. జన్మదిన వేడుకల సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, పండ్ల పంపిణీ, మొక్కల నాటకం వంటి సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# మోడీ హెచ్చరిక సరైనదే, కాని..



యుద్ధం వల్ల స్వయంగా భారతదేశానికి, తక్కిన ప్రపంచానికి కలుగుతున్న తీవ్రమైన నష్టాలు ఏమిటో అనుభవిస్తున్నవే. అటువంటపుడు ఆ యుద్ధం పట్ల, అందుకు కారకులపట్ల అనుసరిస్తున్న నీతి ఏమిటి? అమెరికా, ఇజ్రాయెల్‌ల పట్ల వ్యతిరేకత లేదు. బాధిత దేశమైన ఇరాన్‌కు మద్దతు లేదు. చర్చలు జరుగుతూ ఒప్పందం జరగనున్న వేళ అకస్మాత్తుగా దాడి చేసినందుకు ఖండన లేదు. ఇరాన్ అధినేతను కుటుంబంతో సహా దారుణంగా హతమార్చితే నోరైనా విప్పరు. . పేరు అశానీ సంకేత్.' ఆ మాటకు అర్థం 'సుదూర సంకేతాలు' లేదా 'సుదూర గర్జన' లేదా 'దూరంలోని ఉరుములు'. రెండవ ప్రపంచయుద్ధం జరుగుతుండగా బెంగాల్‌లోని ఒక గ్రామం గురించిన కథ అది. ఆ వివరాలలోకి వెళ్లకుండా ఒక దృశ్యం గురించి మాత్రం చెప్పుకుందాము. ఒక రోజు గ్రామస్థులు కొందరు ఇంటి ముందు అరుగుపై కూర్చుని మాట్లాడుకుంటుంటారు. వారి మాటల్లో కిరోసిన్ కొరత నానాటికీ తీవ్రమవుతుండటం ప్రస్తావన వస్తుంది. అంతలో పైన విమానం శబ్దం రాగా అటు చూస్తారు. కొద్ది సేపటికి విమానం అటు వస్తూ కనిపించి తన దారిలో పోతుంది. ఆ ప్రాంతంలో విమానాలన్నవి లేవు. అపుడు చర్చ ఎక్కడో జరుగుతున్న ప్రపంచ యుద్ధం వైపు మళ్లు తుంది. ఆ యుద్ధానికి, తమ ఊరిలో కిరోసిన్ కొరతకు సంబంధం ఉందటూ ఎవరో చెప్పిన మాటను వారిలో ఒకరు ప్రస్తావిస్తారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో పెట్రోల్‌కు, గ్యాస్ సమస్యలు ఏర్పడాయి. దానితో టిఫిన్ సెంటర్లు మూతపడటం వరకు వెళ్లింది పరిస్థితి. అందుకు మూలం ఇరాన్ యుద్ధంలో ఉందని, ఇంకా చెప్పాలంటే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కలిసి సాగిస్తున్న దుర్మార్గపు యుద్ధంలో ఉందని పెట్రోల్, గ్యాస్ సమస్యలను ఎదుర్కొంటున్న సామాన్యులలో ఎందరికి తెలుసునో చెప్పలేము. సత్యజిత్ రే సినిమాకు ఆధారం బిభూతీ భూషణ్ బందోపాధ్యాయ రాసిన నవల. ఆ సినిమా 1973 నాటిది. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం వల్ల సామాన్యులకు ఎదురవుతున్న రకరకాల సమస్యలపై కూడా తెలుగు రచయితలు బందోపాధ్యాయ తరహా సాహిత్యాన్ని సృష్టించగలిగితే బాగుండును. ప్రధానమంత్రి మోడీ ఇదే హైదరాబాద్‌లో 10వ తేదీన మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి కొన్ని జాగ్రత్తలు చెప్పారు. ఆ వివరాలలోకి వెళ్లే ముందు కొన్ని వాస్తవాలను గుర్తించాలి. ప్రధాన మంత్రిని వెంటనే రాజకీయ ప్రత్యర్థులు, ఇతరులు విమర్శించారు గాని, యుద్ధ కారణంగా పలు సమస్యలు తలెత్తటం ఎదురుగా కనిపిస్తున్నదే. మన దేశంలోనే కాదు ప్రపంచమంతటా. చివరకు యుద్ధ నేరస్థులైన అమెరికా, ఇజ్రాయెల్‌లో కూడా. యుద్ధం గురించిన చర్చను అట్లుంచితే, సమస్యలు మాత్రం వాస్తవమైనపుడు తగిన జాగ్రత్తలు వీలైనంత మేర తీసుకోవాలా లేదా? ప్రపంచమంతా తీసుకుంటున్నపుడు మన వద్ద మాత్రం అక్కర లేదన్నది విమర్శకుల ఉద్దేశమా? అందులోని సహేతుకత ఏమిటి? వారి వద్ద ప్రత్యామ్నాయాలు ఏవైనా ఉన్నాయా? మోడీ పాలనను విమర్శించేందుకు ఇతరత్రా నూటొక్క కారణాలున్నాయి. కాని యుద్ధ సంబంధమైనవి అట్లా కాదు. అప్పటికీ, ఇంధన ప్రత్యామ్నాయాల కోసం గాని, హర్మూజ్ జలసంధి ద్వారా భారతీయ నౌకలను అనుమతించాలంటూ ఇరాన్‌కు నచ్చజెప్పేందుకు గాని ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అవి కొంత ఫలితాలనూ ఇస్తున్నాయి. అటువంటిపుడు ఈ క్లిష్ట పరిస్థితిలో ప్రభుత్వానికి సహకరించవలసిన బాధ్యత ప్రతిపక్షాలతో సహా అందరిపై ఉంటుంది. ఇపుడు వివరాలలోకి వెళదాము. ప్రధాని సూచించిన జాగ్రతలు ఇంధన సంబంధమైనవి, ఆర్థిక సంబంధమైనవి. యుద్ధంవల్ల ఈ రెండు విధాలైన భారాలూ పడుతున్నాయి. వాస్తవానికి ఆయన ఇళ్లలో వంటగ్యాస్ వినియోగం, వ్యక్తిగత వాహనాల వాడకం, రాజకీయ సంబంధమైన సభలూ, సమావేశాలు, అత్యవసరం కాని రకరకాలు యాత్రల వంటి విషయంపై కూడా జాగ్రత్తలు చెప్పాల్సింది. యుద్ధం ఎంత కాలం సాగేదీ చెప్పలేకుండా ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, యుద్ధం ఇప్పటికిపుడు ముగిసినా అందువల్ల కలిగే నష్టాల ప్రభావం చాలా కాలం పాటు ఉండనున్నది. గతంలో ఇతర యుద్ధాల వల్ల జరిగింది అదే. ఆర్థికం, ఉత్పత్తులు, వినయోగం వంటి రంగాలు సాధారణ స్థాయికి చేరుకునేందుకు సమయం పడుతుంది. అటువంటపుడు ఇరాన్ యుద్ధం ఇంకా సాగితే కలిగే నష్టాలు అనూహ్యం ఉంటాయి. ఇంధనాలపై కొన్ని దేశాలు ఇప్పటికే రేషనింగ్ మొదలు పెట్టి, పని దినాలను తగ్గించినట్లు మునుముందు మన వద్ద కూడా జరిగితే ఆశ్చర్యపడనక్కరలేదు. అటువంటి పరిస్థితులు మొదలైతే, ఇప్పటికే కనిపిస్తున్న ధరల పెరుగుదల, రూపాలు విలువ పతనం స్టాక్ మార్కెట్ నష్టాలు ఇంకా తీవ్రరూపం తీసుకుంటాయి. యుద్ధ ప్రాంతం నుంచి ఎరువులు భారీ మొత్తంలో సరఫరా అవుతున్నందున, అందుకు ఇప్పటికే ఎదురవుతున్న ఆటంకాలు పెరిగినట్లయితే, వ్యవసాయంకుంటుబడి ఆహార సమస్యలు తలెత్తుతాయి. ఆ ప్రమాదంపై ఐక్యరాజ్య సమితి సహా అంతర్జాతీయ నిపుణులనుంచి ఇప్పటికే ఆందోళనలు వినిపిస్తున్నాయి. ఈ ప్రమాదంపై సుప్రసిద్ధ బ్యాంకర్ కొటక్ మహీంద్రా ఈ నెల 12న ఢిల్లీలో జరిగిన సిఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) సదస్సులో చేసిన ప్రసంగాన్ని ఒకసారి గమనించండి. ఈ యుద్ధం వల్ల రానున్న కాలంలో 'భయానక పరిస్థితులు' తలెత్తగలవని హెచ్చరించారాయన. ఆ పరిస్థితులు ఇప్పటికే రాకుండా గట్టి ప్రయత్నాలలో ఆప గలిగామని, యుద్ధం ఆగనట్లయితే రాగల కాలంలో ఆపలేమని అన్నారాయన. ప్రధాన మంత్రి కూడా యుద్ధం మొదలైన (ఫిబ్రవరి 28) రెండున్నర నెలల తర్వాత గాని తన హెచ్చరికలు చేయకపోవటం, లేదా చేయవలసి రావటం గమనించదగ్గది. ఈ సమస్యలో సంబంధం గల రెండవ కోణానికి వద్దామిపుడు.

# ఫుడ్ డెలివరీ సంస్థలపై హొటల్ యజమానుల ఉద్యమం

చెన్నై : తమిళనాడులోని హొటళ్ల యజమానులు ఆహార డెలివరీ సంస్థలపై తిరుగుబాటు మొదలుపెట్టారు. పెద్ద కంపెనీ డెలివరీ యాప్‌లకు స్వస్తి పలుకుతున్నారు. రాష్ట్రంలో ఇది ఉద్యమంగా మొదలైందని, రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాపితమవుతుందని హొటల్ యజమానుల సంఘాలు ప్రకటిస్తున్నాయి. నామక్కల్ జిల్లాలో మొదలైన ఈ విప్లవం ఇప్పుడు కడలూరు జిల్లాకు వ్యాపించింది. మరిన్ని జిల్లాల్లోని హొటల్ యజమానుల సంఘాలు ఈ విషయమై చర్చలు నిర్వహిస్తున్నాయి.

మా మనుగడకు ఇబ్బంది : హొటల్ యాజమాన్యాలు

జొమాటో, స్విగ్గీ లాంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు భారీ మొత్తంలో కమిషన్లు తీసుకుంటాయని హొటల్ యజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తమ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా డిస్కౌంట్లు ఇస్తూ తమ మనుగడకు ఇబ్బందిగా మారుతున్నారని చెబుతున్నాయి. వారి సొంత చూసుకుంటూ హొటళ్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, చాలాసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన రావడంలేదని వాపోయాయి. పెద్ద డెలివరీ యాప్‌లు 30–35 శాతం కమిషన్లతో పాటు జీఎస్టీలను తమ నుంచి వసూలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాయి. నగరాలతో పోల్చితే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో నైపుణ్యమైన వంట మాస్టర్లున్నారని, యజమానులున్నారని సంఘ సభ్యులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో పెద్ద డెలివరీ సంస్థల ఒప్పంద పత్రాల్ని చదవకుండానే సంతకాలు చేసేశారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా చాలాచోట్ల హొటళ్లు నష్టాలతో నడుస్తూ తప్పనిసరి పరిస్థితుల్లో ఆ డెలివరీ యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు వివరించారు.

జారోజ్ వైపు ఆసక్తి

కడలూరు జిల్లా చిదంబరంవాసి రామ్‌ప్రసాద్ రూపొందించిన 'జారోజ్' యాప్ మీద ఇప్పుడు హొటల్ యజమానుల సంఘాలు ఆసక్తి చూపిస్తున్నాయి. నెలకు పెద్ద రెస్టారెంట్లకు రూ.3 వేలు, చిన్న రెస్టారెంట్లకు, బేకరీలకు రూ.1500, దీనికి అదనంగా జీఎస్టీతో వచ్చిన స్థానిక యాప్‌ను వారు ఎంచుకున్నారు. దీంతో గత కొన్ని నెలలుగా 50 ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 5 వేల హొటళ్ల నుంచి 8 లక్షల మందికి సేవలందిస్తోంది.

ఈ ఉద్యమం మొదట కేరళలో మొదలైంది..

హొటల్ యజమాన్యాలు పెద్ద డెలివరీ యాప్‌లను బహిష్కరించడం ఇదేం తొలిసారి కాదు. కేరళలో ఈ ఉద్యమం మొదలైంది. 2021లో భారీ కమిషన్లను వ్యతిరేకిస్తూ కొచ్చిలోని కొన్ని హొటళ్లు సొంతంగా యాప్‌లను రూపొందించుకున్నాయి. తర్వాత కేరళ హొటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ స్వతహాగా 'రీజోరు' పేరుతో డెలివరీ యాప్‌ను తీసుకొచ్చింది.

### ధరలు తగ్గిస్తున్నాం

ధరలు తగ్గిస్తున్నాం అని నామక్కల్‌లో జారోజ్ యాప్ ప్రారంభ కార్యక్రమంలో స్థానిక హొటల్ యజమానుల సంఘాల సభ్యులు వెల్లడించారు. కమిషన్ కింద రూ.2 నుంచి రూ.30 వేలు పెద్ద డెలివరీ యాప్‌లకు చెల్లించేవాళ్లమని తెలిపారు. ఇప్పుడు 90 శాతం ఆదా అయ్యే మార్గాన్ని ఎంచుకున్నాం అని చెప్పారు. ఆహార ధరలు కూడా తగ్గిస్తున్నామన్నారు. ఇది హొటల్ యజమానులకు, వినియోగదారులకు లాభదాయకంగా ఉందని, అందుకే పెద్ద యాప్‌లను బహిష్కరించాం అని హొటల్ యజమానుల సంఘాల సభ్యులు వివరించారు.

### ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తమవుతుంది

ఈ ఉద్యమం రెండు జిల్లాలకే ఆగిపోవడంలేదనీ, రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో చర్చలు నడుస్తున్నాయని, త్వరలో కీలక నిర్ణయం వెలువడుతుంది అని అరుళ్ మురుగన్, కార్యదర్శి, నామక్కల్ హొటల్ యజమానుల సంఘం వెల్లడించింది. హొటల్ యజమానులకు, వినియోగదారులకు నష్టం కలిగించే యాప్‌ల చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని వెంకట సుబ్బు, అధ్యక్షులు, కడలూరు జిల్లా హొటల్ యజమానుల సంఘం స్పష్టం చేసింది.

# దేశవ్యాప్తంగా ఎపిలోనే అత్యధిక పెట్రోల్ ధర ..!

అమరావతి :

**దేశంలోని పలు రాష్ట్రాల్లో సోమవారంనాటి పెట్రోల్ ధరలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ రూ.109.46 గా నమోదైంది. ఇది దేశంలోనే అత్యధిక ధర కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం క్రూడాయిల్ కొనుగోళ్లు ఒకే విధంగా ఉన్నప్పటికీ రాష్ట్రాలవారీగా వీటి ధరల్లో ఇంత వ్యత్యాసం ఉండటంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ అధిక ధరలకు ప్రధాన కారణాలుగా ఉన్న పెట్రోల్, డీజిల్ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నుల స్వరూపం..!**

## రాష్ట్రాల వారీగా ధరల్లో వ్యత్యాసానికి కారణాలు

ముడి చమురు కొనుగోలు ధర అంతర్జాతీయ మార్కెట్ పై, డాలర్‌తో రూపాయి మారకం విలువపై ఆధారపడి ఉన్నప్పటికీ తుది వినియోగదారునికి చేరే పెట్రోల్ ధర రాష్ట్రాలవారీగా గణనీయంగా మారుతోంది. పెట్రోల్, డీజిల్‌ను వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) పరిధి నుంచి మినహాయించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను విధిస్తున్నాయి. ఈ వ్యాట్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధిక వ్యాట్ విధించడం వల్ల ఇక్కడ పెట్రోల్ ధర దేశంలోనే అత్యధికంగా ఉంది. తెలంగాణ, కేరళ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా వ్యాట్ అధికంగా ఉండటం వల్ల పెట్రోల్ ధరలు భగ్గుమంటున్నాయి.

## కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినా

కేంద్ర ప్రభుత్వం గతంలో పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర వ్యాట్‌ను తగ్గించలేదు. దీని ఫలితంగా కేంద్రం ఇచ్చిన తగ్గింపు ప్రయోజనం వాహనదారులకు పూర్తి స్థాయిలో అందడం లేదు. చమురు రిఫైనరీల నుంచి పెట్రోల్, డీజిల్ రవాణా చేసే దూరాన్ని బట్టి ఖర్చులు కూడా ధరను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ ప్రధాన వ్యత్యాసానికి కారణం రాష్ట్రాల పన్ను విధానాలేనని తెలుస్తుంది. డీలర్ల కమిషన్ కూడా తుది ధరలో భాగమే. ఇది రిఫైనరీల నుంచి డీలర్లకు ఇంధనాన్ని సరఫరా చేసినందుకుగాను చమురు కంపెనీలు చెల్లిస్తాయి.

## పన్నుల స్వరూపం


పెట్రోల్ తుది ధరలో దాదాపు 50 శాతం నుంచి 60 శాతం వరకు పన్నుల రూపంలోనే ఉంటుంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు ఉంటాయి.

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులు

కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోల్ పై ఒక నిర్ణీత మొత్తం (ఫిక్స్‌డ్ అమౌంట్) లో ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తుంది. ఈ మొత్తాన్ని కేంద్రం తన ఖజానాకు జమ చేసుకుంటుంది. సెస్, స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ పేరుతో కూడా కేంద్రం పన్నులను విధిస్తుంది. వీటిలో చాలా వరకు రాష్ట్రాలతో పంచుకోకుండా కేంద్రమే తీసుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులు

రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ పై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ను విధిస్తున్నాయి. ముఖ్యంగా ఇది డీలర్లకు అమ్మే ధర, కేంద్రం విధించే ఎక్సైజ్ సుంకం, డీలర్ కమిషన్‌తో సహా మొత్తం ధరపై విధిస్తారు. దీని కారణంగా ఇంధనం బేస్ ధర పెరిగితే, రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కూడా పెరుగుతుంది.



RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# ఇండియా, చైనా మధ్య ఇండిగో డైరెక్ట్ విమానాలు

### నవంబర్ 10 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ :


ఇండియా, చైనా మధ్య డైరెక్ట్ విమాన సేవలను ప్రారంభించనున్నట్లు ఇండిగో వెల్లడించింది. నవంబర్ 10 నుంచి ఢిల్లీ, గ్వాంగ్‌జౌ మధ్య రోజువారి విమాన సేవలను అందుబాటులోకి తెస్తోన్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఎయిర్‌బస్ ఎ320 విమానాలను ఉపయోగించనున్నట్లు వెల్లడించింది. కరోనా, ఆ తర్వాత డోక్లామ్ ఆందోళనల సమయంలో ఇరు దేశాల మధ్య డైరెక్ట్ విమానయాన సేవలు పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని మోడీ చైనా పర్యాటన తర్వాత ఇరు దేశాల విదేశాంగ మంత్రిత్వ శాఖలు విమాన సేవల పునరుద్ధరణకు సానుకూల నిర్ణయాన్ని తీసుకున్నాయి.

# రూ.999తో జావాయెజ్డీ ప్రీ బుకింగ్

ముంబయి : ప్రీమియం బైకుల తయారీ కంపెనీ జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ ప్రస్తుత పండగ సీజన్‌లో రూ.999తోనే తమ మోటార్ సైకిళ్లను ప్రీబుకింగ్ చేసుకోవచ్చని పేర్కొంది. జావా లేదా యెజ్డీ మోటార్ సైకిల్‌ను తమ వెబ్‌సైట్‌లో ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని తెలిపింది. 350 సిసి లోపు ఎనిమిది పెర్ఫార్మెన్స్ క్లాసిక్ మోటార్ సైకిల్స్‌పై జిఎస్‌టిని తగ్గించినట్లు జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శరద్ అగర్వాల్ తెలిపారు. జిఎస్‌టి సవరణ తర్వాత తమ బైకుల ధరలు రూ.1.5 లక్షల నుంచి ప్రారంభవుతున్నాయన్నారు. వీటిపై నాలుగు సంవత్సరాలు లేదా 50వేల కిలోమీటర్ల వరకు వారంటీని అందిస్తున్నామన్నారు.

# ఉల్లాస్‌తో సంపూర్ణ అక్షరాస్యతకు ప్రత్యేక చర్యలు







**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18 :**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం--2020లో భాగంగా అమలు చేస్తున్న "ఉల్లాస్" (సమాజంలోని ప్రతి ఒక్కరికీ జీవితాంత విద్యా అవగాహన) కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన శిక్షణ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర, ఉప సంచాలకులు చి. అనిల్ కుమార్, జిల్లా మిషన్ సమన్వయకర్త శివాజీ, పట్టణ మిషన్ సమన్వయకర్త శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, కమ్యూనిటీ స్థాయి వనరుల వ్యక్తులు, వనరుల వ్యక్తులు మరియు స్వయం సహాయక సంఘాల పదాధికారులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలు, నిరక్షరాస్యులకు చదవడం--రాయడం మాత్రమే కాకుండా డిజిటల్ అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ ఫోన్ వినియోగం, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపులు, బ్యాంకు ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్లు, ఏటీఎం వినియోగం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం అవుతారని పేర్కొన్నారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలైతే ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి పట్టణం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు చట్టపరమైన అవగాహన, పౌర హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు చెప్పారు. ఉప సంచాలకులు అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక క్రమశిక్షణ అవసరమని తెలిపారు. బ్యాంకు ఖాతాల ప్రారంభం, పొదుపు అలవాట్లు, ఏటీఎం వినియోగం, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా మిషన్ సమన్వయకర్త శివాజీ మాట్లాడుతూ ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారినప్పుడే సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వనరుల వ్యక్తులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై విస్తృతంగా శిక్షణ ఇచ్చారు.

# ఉత్సాహంగా ముగిసిన విద్యా వారోత్సవాలు

**క్రీడలు, సంస్కృతి, సాహిత్య కార్యక్రమాలతో సందడిగా కళాశాల ప్రాంగణం**

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 18:**

నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో అంగరంగ వైభవంగా ముగిశాయి. "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించిన ఈ ఉత్సవాల చివరి రోజు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు విద్యార్థినుల ప్రతిభను ప్రతిబింబిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల ప్రాంగణం కళలు, క్రీడలు, సాహిత్య సుగంధాలతో సందడి చేసింది. ఈ ముగింపు కార్యక్రమానికి నల్గొండ పట్టణ డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువత తమ సంస్కృతిని, సంప్రదాయాలను, క్రీడా స్ఫూర్తిని ఎల్లప్పుడూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హరీష్ కుమార్, విశ్వవిద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాస రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందించడంలో ఇటువంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భారతీయ సంస్కృతిని పరిరక్షించడంలో సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యమైన వేదికలని అన్నారు. వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు, జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఉత్సవాల ముగింపు వేడుకల్లో కవులు, రచయితల సన్మాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాహిత్య సేవకులను ఘనంగా సత్కరించడం ద్వారా కళాశాల సాహిత్యాభిమానాన్ని చాటుకుంది. విద్య, కళ, క్రీడ, సాహిత్య సమ్మేళనంగా సాగిన ఈ వారోత్సవాలు విద్యార్థినులలో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ విజయవంతంగా ముగిశాయి.




# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

**భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద మ్యూజియం**

**అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి**

**పర్యాటక గైడ్‌లకు ప్రత్యేక శిక్షణ.. నియామకాలు**

**రూ. 5 కోట్లు కేటాయిస్తామన్న మంత్రి**

**హైదరాబాద్, మే 18:**

మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావు. అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ



సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు.ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు.రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ (+బఱఅవ) లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరిన్టెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (×చీూాజఎ) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

**ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం**

**హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (చీణవీూ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా,




సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు.ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి--కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు.

**కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశు సంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.





# కాంగ్రెస్ సమీక్షా సమావేశం

**ఉప్పల్ లో కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం**

**బ్లాక్ లు ఽ డివిజన్ అధ్యక్షుల నియామకంపై కీలక సమావేశం**







ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేసే దిశగా నేడు సమీక్షా సమావేశం జరిగింది.మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు శ్రీ అనిల్ కుమార్ యాదవ్ గారు, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు ఉప్పల్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు.సమావేశం ముఖ్యాంశాలు:

బూత్ లెవల్ ఏజెంట్లు (దీూూ) నియామక ప్రక్రియ వేగవంతం

డివిజన్ అధ్యక్షుల నియామకంపై చర్చ

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం

ప్రజా పాలన కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లడంఅనిల్ కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ: "రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోంది. ఆ ఫలాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బ్లాక్ నుండి డివిజన్ అధ్యక్షుడి వరకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలి" అని పిలుపునిచ్చారు.పరమేశ్వర్ రెడ్డి గా "ఉప్పల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేయడం ఖాయం. సంస్థాగతంగా బలంగా ఉంటే ఎన్నికల్లో తిరుగులేదు. కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుంది" అని భరోసా ఇచ్చారు.బూత్ నుండి బలం.. బలం నుండి గెలుపు ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు,జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఉప్పల్ - శ్రీ శ్రీ నగర్ రోడ్డు ప్రారంభం

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం**

**శ్రీ శ్రీ నగర్ వాసుల చిరకాల కోరిక నెరవేరింది**

**శివారు కాలనీల అభివృద్ధే మా ధ్యేయం**







గత నెలలో శ్రీ శ్రీ నగర్ కాలనీ వాసులు "మా రోడ్డు సరిగా లేక ప్రమాదాలకు గురవుతున్నాం, వెంటనే రోడ్డు వేయించండి" అని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి రజిత పరమేశ్వర్ రెడ్డి గారికి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారువెంటనే స్పందించిన రజిత పరమేశ్వర్ రెడ్డి గారు ?90 లక్షలు శాంక్షన్ చేయించారుఇచ్చిన హామీ ప్రకారం ఈ రోజు సోమవారం ఉదయం శ్రీ శ్రీ నగర్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయిరజిత పరమేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ:

"మున్సిపల్ అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు మొదలుపెట్టించాం. కాలనీ సమస్యలు నా దృష్టికి తీసుకురండి, వెంటనే పరిష్కరిస్తా. శివారు కాలనీ అయినా, మెయిన్ రోడ్డు అయినా అభివృద్ధిలో తేడా ఉండదు" అని హామీ ఇచ్చారు.రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ రజిత పరమేశ్వర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.మాట ఇస్తే.. పని చేసి చం  శివారు కాలనీలకు కూడా సమ న్యాయం

ఈ కార్యక్రమంలో ఎస్. నాగరాజు గారు అరురు కిషోర్ కుమార్ గారు,ఎం. భరత్ రాజ్ గౌడ్ గారు,వై. సుధాకర్ రావు, అప్పన శ్రీనివాస్, ఎం. గిరి బాబు, డా. ప్రవీణ్, వైఎస్ఎన్ మూర్తి, మల్లికార్జున రావు, మల్లా రెడ్డి, సత్యన్, పి. సత్యనారాయణ, శంకర్ గౌడ్

శ్రీమతి అరురు పల్లవి గారు,శ్రీమతి అప్పన వెంకట కుమారి గారు,శ్రీమతి హరి కుమారి గారు,శ్రీమతి రాధ గారు,శ్రీమతి స్వరూప గారు,శ్రీమతి శోభ, శ్రీమతి అనంత పద్మ, శ్రీమతి జయమ్మ, శ్రీమతి వీరమణి గారు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.







ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యాచరణ లో భాగంగా నేడు క్రీడా మరియు యువజన వారోత్సవాలుపాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు,వాకిటి శ్రీహరి గారు, ఏపీ జితేందర్ రెడ్డి గారు,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి గారు,మల్ రెడ్డి రాంరెడ్డి గారు, స్పోర్ట్స్ అథారిటీ వీణ సోనీ బాలాదేవి గారు..ఎల్బీ స్టేడియం కాంప్లెక్స్ లో జరిగిన జుంబా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు,వాకిటి శ్రీహరి గారు,ఏపీ జితేందర్ రెడ్డి గారు,శివసేన రెడ్డి గారు,మల్ రెడ్డి రాంరెడ్డి గారు,సోనీ బాలాదేవి గారు.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన మరియు క్రీడా వారోత్సవాలు..





పాలకుర్తి మండలం ముత్తారం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి వారి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేశారు..ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ నాయకులు కాంగ్రెస్ కా ర్యకర్తలు గౌడ కులస్తులు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# బోడుప్పల్ సర్కిల్ ప్రజా సమస్యలపై కమిషనర్‌ను కలిసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**బోడుప్పల్- చెంగిచెర్ల ప్రాంత అభివృద్ధి అంశాలపై వినతిపత్రం అందజేత...**

**సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కమిషనర్**

ఈ రోజు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల, బోడుప్పల్ ప్రాంత సమస్యలపై మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ గారు, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గారు మేడ్చల్ జిల్లా బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిని కలిశారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చెంగిచెర్ల,బోడుప్పల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై చర్చించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.







జూన్ 2 ఒకవైపు స్వరాష్ట్రం స్వప్నం సాకారమైన వేళ

.మరోవైపు నెరవేరుతున్న పేదల సొంతింటి కల.

.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి ఆధ్వర్యంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు శ్రీకార..

..జూన్ 2, 2026, వేదిక: ఆదిలాబాద్ జిల్లా.

.ప్రజాప్రభుత్వం తోడు ఉండగా..

.పల్లెపల్లెనా పేదలకు పండగ..

మీ.

శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్


# తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దిన పోలీస్ అధికారులను సన్మానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్):**

దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. చతిస్గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల లో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు.ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు మరియు మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ ఽ గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ ఽ మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు.ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు."మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది" అని అమిత్ షా పేర్కొన్నారు.ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు.1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి



నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. నక్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.ఒక జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.







ఇటీవల వారి కూతురు వివాహం కారణంగా 6వ వార్డ్ లో పలు వివాహాలకు హాజరుకానందున ఈరోజు తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీ లో తమ తమ నివాసానికి వెళ్లి పలు జంటలను ఆశీర్వదించడం జరిగింది పల్ల వెంకటమ్మ సోమయ్య గార్ల కూతురు మమత – గణేష్, చెడుపాక సోమనర్సు వెంకటయ్య గార్ల కూతురు సరస్వతి పరశు రాం మరియు శ్రీమతి శ్రీ మంగళపల్లి లక్ష్మీ ఎల్లయ్య గార్ల కూతురు దీప్తి (సిరి) శ్రీనివాస్ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ పెదగాని సోమన్న గారు ఈ కార్యక్రమంలో నాయకులు మంగళ పెల్లి కృష్ణమూర్తి, డబ్బా సోమయ్య, ప్రతాప్ కుమార్, డాక్టర్ యాకయ్య, మురళి మరియు ప్రకాష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



ఈరోజు 18/05/2026 పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని తొర్రూరు మున్సిపాలిటీ 6వ వార్డు కు చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ ఠ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మంగళపెల్లి త్యాగరాజు గారు గత కొద్ది రోజుల క్రింద తన మిత్రుడి మ్యారేజ్ ఫంక్షన్ కి వెళ్లొస్తుండగా కాసం షాపింగ్ మాల్ వద్ద యాక్సిడెంట్ జరిగి తన కాలుకి ఫ్యాక్చర్ మరియు కొన్ని గాయాలు కూడా అయినవి త్యాగరాజు గారిని పరామర్శించి ఆర్థిక సాయం చేసిన తొర్రూర్ ( మాజీ సర్పంచ్ ) పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌరవనీయులు శ్రీ పెదగాని సోమన్న గారు , వీరితో పాటు మాజీ వార్డ్ మెంబర్ మంగళపల్లి కృష్ణమూర్తి గారు, 6వ వాడు అధ్యక్షులు మంగళపల్లి ప్రతాప్ కుమార్ గారు, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ణతీ. ా×జ. యాకయ్య గారు, డబ్బా సోమయ్య గారు, దర్గయ్య గారు, =వీూ ప్రకాష్ గారు, పార్నంది సుదర్శన్ గారు, పల్ల ఉప్పలయ్య గారు, తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో ధాన్యం కొనుగోలుపై సమీక్ష అధికారులు, మిల్లర్లతో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంగారు రివ్యూ మీటింగ్

రామన్నపేట మండల కేంద్రంలోని వీూఖా కార్యాలయంలో మండలానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై అధికారులు, మిల్లర్లతో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు రివ్యూ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మిల్లర్లు కూడా సమన్వయంతో



పనిచేసి ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.





అమెరికాలో రోడ్డు ప్రమాదంలో, చెర్వుగట్టుకు చెందిన నవ్య మృతి చెందగా.. ఆమె కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గారునార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన గడుసు నవ్య గారు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ నవ్య గారి మృతి ఎంతో బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అండగా ఉంటామని పేర్కొన్నారు.





–నకిరేకల్ మండలం టేకులగూడెం, మరియు నకిరేకల్ టౌన్ మూసీ రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంగారు ఆకస్మికంగా తనిఖీ చేశారు–.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు.అదేవిధంగా కేంద్రాలలో తాగునీరు, టార్పాలిన్లు, హమాలీల సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం వెంటనే కొనుగోలు చేసి ఎటువంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నకిరేకల్‌లో మారథాన్ ర్యాలీ లో పాల్గొన్న ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గారు

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన మారథాన్ ర్యాలీలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం



చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడం జరుగుతుందన్నారు. యువత ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు, వ్యాయామం, మారథాన్‌లాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేసే ఉద్దేశంతో ఈ మారథాన్ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






తుంగతుర్తి నియోజకవర్గం
ఈరోజు నల్గొండ జిల్లా శాలిగౌరరం మండలం మాదారం గ్రామానికి చెందిన శాలిగౌరారం మండలం౹ూజూ చైర్మన్ తాళ్ళూరి మురళి గారు సతీమణి తాళ్ళూరి నర్మల గారు మరణించిన గా వారి భౌతిఖాయని పూలమాల వేసి వారికి నివాళులర్పించి వారి కుటుంబసభ్యుల ను పరామర్శించిన
తుంగతుర్తి శాసనసభ్యులు
గౌరవ శ్రీ మందుల సామేలు గారు



తుంగతుర్తి నియోజకవర్గం
ఈరోజు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని వారికీ పండిన పతి వద్ల గింజను కొనుగోలు చేసి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు లారీల సంఖ్యను పెంచాలని రైతులకు
అందుబాటులో ఉండి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా
చూసుకోవాలని ధాన్యన్ని కొనాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేసే బాధ్యత
నాది మా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుంది మా రేవంత్ రెడ్డీ
రైతులకు ఎలాంటి ఇబ్బందులు
కల్గనియొద్దని ఆదేశించారు అని తెలియజేసిన తుంగతుర్తి శాసనసభ్యులు
గౌరవ శ్రీ మందుల సామేలు గారు



తుంగతుర్తి నియోజకవర్గం
ఈరోజు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి గ్రామానికి చెందిన మండల సాయిని శ్రీకాంత్ గారు మరణించిన గా వారి చిత్ర పటానికి పూలమాల వేసి వారికి నివాళు లర్పించి వారి కుటుంబసభ్యుల ను పరామర్శించి 5000రూపాయలు ఆర్థిక సాయం అందించిన
తుంగతుర్తి శాసనసభ్యులు
గౌరవ శ్రీ మందుల సామేలు గారు

## గద్వాల గడ్డపై సరితమ్మకు ఘన స్వాగతం పలికిన - ధరూర్ రవి..!



?తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించి,తొలిసారి తన సొంత నియోజకవర్గం గద్వాలకు విచ్చేసిన సందర్భంగా జమ్మిచేడు జమ్ములమ్మ దగ్గర శ్రీమతి సరిత తిరుపతయ్య గారికి మరియు ముఖ్య అతిధులు ఎంపి మల్లు రవి ధరూర్ రవి పుష్పగుచ్చాం ఇచ్చి స్వాగతం పలికారు..పట్టణ,ఆయా మండలాల గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు చైర్‌పర్సన్ సరితమ్మ గారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు...



ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహించనున్న సందర్భంగా లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా గారిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్కరాలకు ఆహ్వానించిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు
శ్రీమతి కొండా సురేఖ గారు మరియు దేవాదాయ శాఖ అధికారులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక


# ఆట

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా జట్టు

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తాజా ర్యాంకింగ్స్ విడుదల చేసింది. వార్షిక టెస్ట్ ర్యాంకింగ్స్ ఇవి. అలాగే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ కు సంబంధించిన పాయింట్ల పట్టిక కూడా విడుదల అయింది. ఏడాది కాలంలో ఆయా జట్లు ఆడిన టెస్ట్ మ్యాచ్ లు, వాటిల్లో సాధించిన విజయాల ఆధారంగా తాజా ర్యాంకింగ్స్ ను రూపొందించింది ఐసీసీ. ఈ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా జట్టు అగ్రస్థానంలో నిలిచింది. వార్షిక ర్యాంకింగ్‌ల ప్రకారం.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 87.50 శాతంతో అగ్రగామిగా ఉంది. న్యూజిలాండ్ 77.78 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. భారత జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. టెస్ట్ ఫార్మట్ ఆస్ట్రేలియా తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది.. ఏడాది కాలంగా. ఇందులో తన పాయింట్లను మరింత మెరుగుపర్చుకుంది. ఏకంగా మూడు అదనపు పాయింట్లను సాధించింది. దీంతో ఆ జట్టు ఖాతాలో ఉన్న పాయింట్ల సంఖ్య 131కి చేరుకుంది. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోని మొదటి రెండు స్థానాలపై ఎటువంటి ప్రభావం చూపలేదు. ఆస్ట్రేలియాతో పాటు దక్షిణాఫ్రికా కూడా ఈ ఫార్మట్ లో తన అధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఆస్ట్రేలియా 131 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, 119 పాయింట్లతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. 104 పాయింట్లతో భారత్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఇంగ్లాండ్– 102, న్యూజిలాండ్– 101 పాయింట్లతో నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచాయి. పాకిస్థాన్ 89 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకోవడానికి ఎగబాకింది. మిగిలిన జట్లలో శ్రీలంక 86 పాయింట్లతో ఏడు, వెస్టిండీస్ 68 పాయింట్లతో ఎనిమిది, బంగ్లాదేశ్ 67 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. ఐర్లాండ్– 25 పాయింట్లతో పదో స్థానానికి చేరింది. జింబాబ్వే– 10 పాయింట్లతో 11, ఆఫ్ఘనిస్తాన్ జీరో రేటింగ్‌తో చివరి స్థానంలో కొనసాగుతోంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలోనూ ఆస్ట్రేలియాదే ఆధిపత్యం. ఆ జట్టు 87.50 శాతంతో టాప్ లో ఉంది.

# జట్టులోకి మిచెల్ స్టార్క్ ఎంట్రీ: అక్షర్ పటేల్

జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఉత్కంఠ పోరు జరుగుతోంది. ఈ కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అద్భుతమైన ఫామ్‌లో ఉండగా.. ఢిల్లీ క్యాపిటల్స్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. టాస్ గెలిచిన అనంతరం రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ.. పిచ్ కొంచెం పొడిగా, ప్యాచ్‌లుగా కనిపిస్తోందని.. అందుకే మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. రెండో ఇన్నింగ్స్ సమయానికి వికెట్ నెమ్మదించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గత మ్యాచ్‌లో 228 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడం జట్టులో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ఈ మ్యాచ్‌లో పూర్తిస్థాయి 40 ఓవర్ల అత్యుత్తమ క్రికెట్ ఆడి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్ కోసం రాజస్థాన్ జట్టులో రవి బిష్ణోయ్, శుభమ్ దుబే తుది జట్టులోకి వచ్చారు. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ.. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపిస్తోందని, లక్ష్యాన్ని ఛేదించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపాడు. గత వైఫల్యాలను పక్కన పెట్టి బేసిక్స్‌పై దృష్టి సారించడం ముఖ్యమని.. సానుకూల దృక్పథం, బాడీ లాంగ్వేజ్‌తో ఈ మ్యాచ్‌లో పుంజుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో జట్టులో మార్పులు అనివార్యమని ఆయన పేర్కొన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఈ మ్యాచ్ కోసం మూడు కీలక మార్పులు చేసింది. స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ జట్టులోకి తిరిగి రాగా.. చమీరాకు చోటు దక్కలేదు. అలాగే పాతుమ్ నిస్సంకా తుది జట్టులోకి రావడంతో డేవిడ్ మిల్లర్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. అశోక్ శర్మకు కూడా తుది జట్టులో అవకాశం లభించింది. హోమ్ గ్రౌండ్‌లో రాజస్థాన్ బ్యాటర్లు భారీ స్కోరు సాధిస్తారా లేక ఢిల్లీ బౌలర్లు వారిని అడ్డుకుంటారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# సన్‌రైజర్స్ లోకి అంబరీష్ ఎంట్రీ

ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపుతోంది. భారీ విజయాలతో దూసుకెళ్తోంది. వరుసగా అయిదు విజయాలను తన ఖాతలో వేసుకుంది. మొన్నటికి మొన్న ముంబై ఇండియన్స్ ను వాళ్ల సొంత గడ్డ వాంఖెడే స్టేడియంలో చితగ్గొట్టడం అదరహో అనిపించుకుంది. ఈ మ్యాచ్ లో ఓడిన దెబ్బకు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ప్లేఆఫ్స్ పై దాదాపుగా ఆశలు వదులుకున్నట్టయింది. ఇప్పటివరకు తొమ్మిది మ్యాచ్ లు ఆడిన సన్ రైజర్స్ ఆరింట్లో నెగ్గింది. మూడింట పరాజయాన్ని చవి చూసింది. మొత్తం 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇంకా అయిదు మ్యాచ్ లు ఆడాల్సి ఉందీ జట్టుకు ఇందులో ఇంకో మూడు గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది పాట్ కమ్మిన్స్ సేన. ఈ పరిస్థితుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. గాయపడ్డ శివం మావి స్థానంలో 18 ఏళ్ల సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీష్ ఎంట్రీ అయ్యాడు. అతనితో కాంట్రాక్ట్ ను కుదుర్చుకుంది జట్టు మేనేజ్మెంట్. గత ఏడాది జరిగిన ఐపీఎల్ లో వేలంలో 75 లక్షల రూపాయల ధరకు శివం మావిని జట్టులోకి తీసుకుంది సన్ రైజర్స్. గజ్జల్లో గాయం కారణంగా టోర్నమెంట్ మొత్తానికీ దూరం అయ్యాడు. దీంతో ఆర్ఎస్ అంబరీష్ తో అతని స్థానాన్ని భర్తీ చేసింది.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA



# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

## ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷–లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷–లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ–సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

# మెగాఫోన్ పట్టిన రామ్ పోతినేని

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్ డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తన దర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం.



# ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్ప

గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శుక్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ ఆల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది.



Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434